# మల్లమ్మ ఉసురు



తూర్పున పటమెగిరింది. కలగని మేలుకొన్నట్లు కలవరపడ్తూ నిద్రపడక మీదనుండి ఎగిరిపడి లేస్తాడు మల్లయ్య. పడకమీదనుండి లేచీలేవడంతోటే లేడికి లేచింది పరుగన్నట్లుగా గాటికికట్టిన ఎద్దుల్ని తట్టిలేపి పలుపుల్నివిప్పి, కుడితికి వదిలి, అవి తొట్టిలో కుడితినీళ్ళు జుర్రుకొంటూంటే బానా మోకు ఒక భుజాన పెట్టుకొనే మల్లయ్య ఆ పూట మోకాళ్ళ సందున తల పెట్టుకొన్నాడు.

ఆ ఊరిని నిద్రలేపే తొలికోళ్ళు రెడ్డోరి పశువుల కొట్టం వెన్నుగాడి మీది కెక్కి రెక్కలు తట్టుతున్నాయి– ఆవేళ తమ ముందు తలవంచిన మల్లయ్యను చూసి!

తొలికోళ్ళకు తొలికోడి మల్లయ్య.

మల్లయ్య రాళ్ళబావిలో మోటగట్టి 'రాఁవన్న రాఁవో!' అని గొంతెత్తితేనే తొలికోళ్ళకు గొంతు పెగిలేది. ఊరు పనీపాటలకు కదిలేది. ఊరు పనీపాటల్లో దిగేసరికి మల్లయ్య దుర్గంరాజుల కయ్యకు తడిపడేది. అలాంటి మల్లయ్య తూర్పున పటమెగిరే వేళలో పడక

మీదనుండి పైకిలేవలేదు. ఏదో పాలుమారినాడనుకొంటే– అదీ కాదు. ఎగిరి పడినట్లు లేచి ఎటూతోచక కాళ్ళసందున తలపెట్టుకొని కూర్చుని ఆలోచిస్తున్నాడు.

గాటకట్టిన గొడ్లు గడ్డిపోచ కొరకడంమాని గుంజులాడుతున్నాయి. మల్లయ్య వైపు చూసి 'అంబా! అంబా!' అని అరుస్తున్నాయి.

మల్లయ్య గుండెల్లో ఏదో బాధ. వెలికి చెప్పుకోలేని బాధ. చెప్పుకోలేక చెప్పుకోకుండ ఉండలేక మనిషి మెలికలు తిరిగి పోతున్నాడు.

గంగుల్ నాయుడు కూసిన కూత!– మరిచి పోదామంటేకూడా మరుపు రావడం లేదు. ఇంకా చెవుల్లో గింగురు మంటూనే ఉంది.

"ఆ ముందటి రోజు సందకాడ... గ్రామ చావిడి కాడ... నలుగురి ముందర నిలబెట్టి నిలదీసి అడిగినాడు. అడిగినాడా? కాదు. కడిగేసినాడు. అడిగినా కడిగినా తప్పులేదు. అయితే దానిక్కూడా ఒకమట్టూమరేదా ఉండక్కర్లేదా? ఎదిటోడు వాడూ ఒక మనిషే అన్న ఇంగితగ్నానం ఉండక్కర్లేదా? గంగుల్ నాయుడు ఉన్నోడు. ఉన్నోళ్ళకి మట్టూ మరేదా, ఇంగిత గ్నానం ఉండక్కర్లేదేంవో? అందుకే నోటి కొచ్చినట్లు కూసినాడు!"

ఈ మాటలు మనస్సులో మెదులుతూంటే మల్లయ్య మనస్సు ఎట్టెట్టో పోతూఉంది. "బతికినంత బతుకూ బతికి బతికినంతకాలం ఒకడితో ఒకమాట పడకుండా బతికి కడకిట్లా మాటపడడం...? దీనికంటే రాళ్ళబావిలో రాళ్ళుగట్టుకొని దూకితే మాత్రఁవేం?"– అని ఆవేశ పడ్డాడు. అంతలోనే 'అయ్యో! పెండ్లాం పిలకాయిల గతేం కావాల?' అని బాధపడ్డాడు. ఆ బాధతోనే ఇల్లుచేరాడు.

ఆ రాత్రి మల్లయ్య పెండ్లాం మల్లమ్మ ఎన్నోవిధాల అడిగింది. ఎంతెంతగానో బతిమాలింది. 'నాతో కూడా సెప్పకుండా నీలో నువ్విట్లా కుంవల్తా ఉంటే నేనే నుయ్యో! గొయ్యో! సూసుకుంటా" అని బెదిరించింది.

అయినా మల్లయ్య ఎలా చెప్తాడామాట నోరు తెరిచి?

మల్లమ్మ అడగడంమానుకొని ఒక్కమూల మూతిముడుచుకొని ముడుక్కొనింది. గోడకు చేరగిలబడి కాళ్ళుబారసాచి చూరువైపు చూస్తున్న మల్లయ్యచూపుల్లో మార్పులేదు.

జాము రాత్రి కావస్తూ ఉంది.

తండ్రి దరిదాపులకు చేరలేక తల్లిని పలకరించలేక ఆకలికి తట్టుకోలేక ఆ ఇంట్లో మూలకొకరుగా చేరి మూలుగుతున్న పిల్లలు! ఐకమత్యమే బలమన్నట్లుగా అందరూ ఒక్కటై 'అమ్మా! ఆకలే!' అని కేకలు వేస్తున్నారు.

"ఛీ...పాడు గుంపా!...ఎప్పుడు సూడు 'తిండి! తిండి' అని అల్లాడి పోతారే! అదే సగం దరిద్రం కొంపకి!... ఇద్దో ఇట్లా నామిందపడి కొట్టుకునే దానికంటే అడిగితే అరీగురీ మనకుండా ఉండాడే మీ అయ్య. ఆయన మిందబడి మొత్తుకోరాదా?" అని ఆ ఇల్లాలు విసుక్కొనింది.

పాపం! పసిబిడ్డలు. అమ్మ మాటను కాదనలేక అయ్యను పలకరించలేక బెదురు చూపులు చూస్తున్నారు.

మల్లయ్య తీరులో మార్పులేదు.

"ఆయన సూస్తే అట్లా? బిడ్డలు సూస్తే ఇట్లా? ఇంక నాగతెట్లారా తండ్రీ!" అని విసుక్కొంటూనే మల్లమ్మ పైకి లేచింది.

"నామొకం సూడకపోతే పొయ్‌నారు... ఆకిలో అని అల్లాడిపోతున్న ఆ కసుగందుల మొకంవైనా సూడండి!" అని మల్లమ్మ శతపోర్తే పడలేక పడలేక అంత ఎంగిలి పడ్డాడు మల్లయ్య. అయినా అతడు ఎంతసతపోర్నా కంటిమీద రెప్పపడలేదు.

మూడంకణాల పూరింటికి, పశువుల కొట్టానికి మధ్య ఆరుబయట మంచం వేసుకొని ఆ మంచం మీద మల్లయ్య వెల్లకిలా పడుకొన్నాడు. నింగి నీలాలు పారుతూ ఉంది. నీలాలు పారుతున్న నింగిమీద చుక్కలు మిలమిల మెరుస్తున్నాయి. ఆ చుక్కల్ని చూస్తున్నాడు మల్లయ్య. లెక్కపెట్టలేని ఆ చుక్కలకు మల్లే తనతలలో లెక్కపెట్టలేనన్ని ఆలోచనలు!

మింటిమీద మిలమిల మెరుస్తున్న చుక్కల్లో కొన్ని మాయమవుతున్నాయి. మరి కొన్ని కొత్తగా పుట్టుకొస్తున్నాయి-మల్లయ్య తలలో ఆలోచనలతో పోటీపడ్తూ! వేగుచుక్క పొడిచింది. మల్లయ్య ఆ చుక్కవైపు చూస్తూనే ఉన్నాడు. చూస్తూచూస్తూ ఉండగానే అతని కండ్లు అతనికి తెలియకనే మూతలు పడ్డాయి.

ఎగిరిపడిలేచి చూసేసరికి తూర్పున పటమెగురుతూ ఉంది.

మరచిపోదామన్నా మరపురాని గంగుల్ నాయుడు మాట మనస్సులో మెదిలేసరికి తల తనంతట తానుగా వాలిపోయింది- కాళ్ళ సందుల్లోకి!

"అది గాదు మాంవా! కాళ్ళ సందన తలకాయి బెట్టుకొని కూసుంటే కావాల్సిన పన్లు ఎట్టవతాయ్, మాంవా? లెయ్ మాంవా లెయ్!... లేసి పన్జూడు."

ఇల్లాలి పిలుపు చెవినిపడ్తే తలపైకెత్తి చూశాడు మల్లయ్య.

ఏదో పాత్రనిండుకుకుక్కి పైనమూతపెట్టి మూసిపెట్టినట్లు అంత వరకు గుండెల్లో గూడు కట్టుకొన్న బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకొనింది. ఇల్లాలి మీదపడి ఆ బాధంతా తీరిపోయేదాక 'బోరో!' మని ఏడవాలనుకొన్నాడు. అయినా అతిప్రయత్నం మీద నిబ్బరించుకొన్నాడు. నిట్టూరుస్తూ పైకి లేచాడు.

"ఇట్లాంటి మొగోడ్తో ఎట్లా సంసారం చెయ్యాల్రా బగమంతుడా! అడిగితే సెప్పడు. అడక్కుండా ఉండాలంటే మణుసొప్పదు.ఏదైనా నోరిప్పి సెప్తే అట్టా గా దిట్టా అనైనా సెప్పొచ్చు" అని ఆ ఇల్లాలు గొణుక్కొంటూనే పాచిపనుల్లో తల దూర్చింది.

మల్లయ్య గుంజులాడుకొంటున్న ఎద్దుల్ని తట్టి సముదాయించాడు. పలుపులు విప్పి కుడితి నీళ్ళకు వదిలాడు. బానా మోకు ఒక భుజాన, బండీ కదురుగోలు ఇంకొక భుజాన పెట్టుకొని ఎద్దుల్ని తోలుకొని మడికాడికి కాలుకదిపాడు.

మల్లయ్య రాళ్ళబావిలో మోటకట్టాడు.

రాళ్ళబావిలో మల్లయ్య మోటతోలుతూంటే రాగాలు అల్లంతదూరాన పరవగుట్టను తాకి ప్రతిధ్వనించేవి. అయితే ఆపూట మోటతోల్తున్నాడు... యాంత్రికంగా... ఎంతో పరధ్యానంగా!–

మల్లయ్య పడుతున్న బాధను అర్థం చేసుకొన్నట్లుగా ఆ పూట ఎద్దులు కూడా ఎంతో ఒద్దికలు పోతున్నాయి. అతడు మోట తోలుతున్నాడన్న మాటేకానీ ఆలోచనలు మాత్రం అడ్డూ ఆపూ లేకుండా సాగిపోతున్నాయ్!

పొద్దు పుడ్తుంది. పొద్దెక్కుతుంది. పొద్దు వాలుతుంది. పొద్దు కుంకుతుంది. పొద్దు కుంకితే గ్రామ చావిడికాడ మద్దిస్తం. మళ్ళీ గంగుల్ నాయుడు నిలదీసి అడగతాడు. అడిగితే ఏం చెయ్యాలి?–

ఈ పొద్దు పుట్టకుండా ఇలానే ఉండిపోతే?–

అతడు అనుకొంటూ ఉండగానే బారెడు పొద్దెక్కింది.

ఎవరో వెంటబడి తరుముతున్నట్లు ఎగబడుతున్న పొద్దునుచూసి తానుపిచ్చిగా ఆలోచించినందుకు తనలోతానే నవ్వుకొన్నాడు మల్లయ్య. తననవ్వు తనకే ఎబ్బెట్టుగా ఉంది ఏడవలేక నవ్వినట్లుగా!

మోటతోల్తూ మల్లయ్య దుర్గంరాజుల కయ్య వైపు కన్నెత్తిచూశాడు. పొట్టకర్ర కొచ్చిన పైరు నవనవ లాడుతూ పిల్లగాలుల సవ్వడికి మెల్లగా ఊగిసలాడుతూ ఉంది. 'ఇంకొక పది పదహైదురోజులు తడేస్తే ఆ మిందట తడిడ్సి పెట్టచ్చు!!' అనుకొనే సరికి తృప్తి. 'దినంవూ అయితే ఇయ్యరంవకే మోటిడ్సి పెట్టేయాల్సింది. ఈ పూట కయ్యతడి పడేకుందికి పొద్దు నడిమిట్ట కొస్తిందేమో?' అనుకొనేసరికి అసంతృప్తి. రాత్రికి జరగబోయే మద్దిస్తాన్ని తలచుకొంటే ఆవేదన– వీటిమధ్య నలిగిపోతూ మల్లయ్య మోట తోల్తున్నాడు.

* * * * *

మల్లయ్య మంచి మనిషి!

గంగుల్ నాయుడు ఉన్న మనిషి!!

ఆ ఊళ్ళో అడుగుబెట్టి చెట్టుమీద పిట్టనడిగినా... చెవితో స్నేహం చేయాలని వెంటబడే దోమ నడిగినా... చెప్పుకింద పడి నలిగిపొయ్యే చీమ నడిగినా... శిశువు నడిగినా... పశువు నడిగినా– ఈ మాటే అంటారు.

మల్లయ్య మంచిమనిషి అనిపించుకోవడానికి చాలాకాలం పట్టింది.

గంగుల్ నాయుడు ఉన్న మనిషి అనిపించుకోవడానికి అనుకున్నంతసేపు కూడా పట్టలేదు.

'నోకం తెలియాల్నే కానీ, తెలిస్తే ఈలోకంలో బతికేది శానాసులువు!' అని గంగుల్‌నాయుడి నమ్మకం.

'నమ్మి చెడిన వాళ్ళులేరు. నమ్మకుండా బాగుపడిన వాళ్ళుకూడా లేరు' అని కూడా గంగుల్ నాయుడు నమ్ముతాడు.

అందుకే గంగుల్ నాయుడు ఆ ఊర్నే కాదు– ఆ పాయకట్టునంతా నమ్మాడు. ఆ ఊరూ పాయకట్టూ అతన్ని నమ్మింది!

ఆ ఊళ్ళో పెండ్లికైనా, పేరంటానికైనా, చావుకైనా సమర్తకైనా, కాడెద్దులు కొనాలన్నా, కడకు పిల్లోళ్ళను బడిలో చేర్పించాలన్నా గంగుల్ నాయుడి అవసరముంది. అవసరమంటే– గంగుల్ నాయుడు వ్యక్తిగా కాదు– అవసరానికి ఆదుకొనే ఆర్థికశక్తిగా!

ఎంత పరపతి ఉన్నా, బ్యాంకులో అప్పుతీసుకోవాలంటే వారాలు పట్టవచ్చు. నెలలే తిరగవచ్చు. కడకు బ్యాంకులో దాచుకొన్న డబ్బును తీసుకోవాలంటే కూడా కనీసం కొన్ని గంటలైనా పట్టవచ్చు. కానీ నాయుడి గారిదగ్గర మాత్రం ఆ ఇబ్బంది లేదు.

రాత కోతల్లేవు. అడుమానం పెట్టే అవసరం లేదు. జామీను గీమీను జాన్తానై. నగానట్రా కుదువ పెట్టుకునే కుతంత్రాలు లేవు. అడగడమే ఆలస్యం. ఆచేత్తో ఇస్తే ఈచేత్తో తీసుకోవాల్సిందే!

అయితే ఒక్కటే షరత్తు!

ఏమిటా షరత్తంటే– ఫలానా రోజు వడ్డీమొదలు చెల్లిస్తానంటే ఆరునూరైనా నూరు ఆరైనా, అగ్రహారం కొళ్ళపోయినా ఆవేళకు ఒక్కపైసా పొల్లుపోకుండా చెల్లుపెట్టాల్సిందే!

ఇచ్చిన అప్పును ఒక్కరోజు అటుఇటు కాకుండా వసూలు చేసుకొంటున్నాడు. వడ్డీని పైసల్తో సహా రాబట్టు కొంటున్నాడు. అయినా ఆ ఊళ్ళో వాళ్ళందరికీ గంగుల్ నాయుడంటే గురీ... గౌరవం. కారణం– 'ఎంత ధారాళంగా ఇస్తాడో అంతఖచ్చితంగా వసూలు చేసుకొంటాడు. మాటంటే మాటేగదా? అందులో తప్పేముంది?' అని సమాధానపడే సహృదయత వాళ్ళది.

అడిగిన వాళ్ళకు అడిగినట్లే అప్పులివ్వడానికి గంగుల్ నాయుడంత డబ్బులున్నవాడా అంటే– అడిగినవాళ్ళకు అడిగినట్లే ఇస్తున్నంత కాలం ఉన్నవాడనే చెప్పకతప్పదు. కానీ గంగుల్ నాయుడు మాత్రం అంత ఉన్నవాడు కాదు. అయితే ఆఊరికే కాదు– ఆ పాయకట్టుకంతా ఎలా అప్పులివ్వగలుగుతున్నాడంటే– అదే నోకం!.

గంగుల్ నాయుడు మారుబేరం చేస్తాడు.

పక్కన పట్టణంలో నాయుడు ఒక షాహుకార్ని నమ్మపలుక్కొన్నాడు. ఎన్ని ఇబ్బందులున్నా మాటమీద నిలబడి మనిషిని మంచిచేసుకొన్నాడు. అందుకే గంగుల్ నాయుడికి డబ్బుకు కొదవ లేదు. నూటికి నెలకు ఒక్కరూపాయి వడ్డీవంతున తెస్తాడు. తానుమాత్రం రెండు రూపాయలు వడ్డీ వసూలు చేస్తాడు. ఈ మారుబేరంలో ఊళ్ళోవాళ్ళ అవసరాలు తీరడమే కాకుండా నాయుడికి ఆర్థిక బలంతో పాటు అంగబలాన్నిక్కూడా కొదవలేకుండా కొనసాగిపోతూ ఉంది.

సదరు నాయుడిగారి వద్ద మల్లయ్య బాకీచేశాడు.

శెనక్కాయలు పెరకతానే కళ్ళంలో కాయలు కళ్ళంలో ఉండగానే అమ్మి కట్తానన్నాడు. అయితే వేరుశెనగ పంట మంచిపూతమీద ఉండేటప్పుడు చినుకు నేల రాల్లేదు. బావులు అడుగంటాయి. మంచి పూతమీద ఉన్న శెనగచెట్లు ఎక్కడి దక్కడ మలమల మాడింది.

చేతి కందుతుందనుకొన్న పంట చెయిజారిపోతే మల్లయ్య కడుపు రగిలింది. అయినా ఏం చేస్తాడు?

మల్లయ్య మాటతప్పక తప్పలేదు.

మల్లయ్య మంచితనాన్ని చూసి వానల్లేక ఎండిన వేరుశెనగ పంటను చూసి గంగుల్ నాయుడు నిలదీసి అడగలేక నీళ్ళు నములుతున్నాడు.

మల్లయ్య 'బతుకుజీవుడా!' అనుకొని నాయుడు అడగముందే తనకు తానుగా వెళ్ళి చెరుకు గానుగాడుతూనే పువ్వుల్లో బెట్టి ఇస్తానని చెప్పడమే కాకుండా చేతులెత్తి మొక్కాడు.

గంగుల్ నాయుడు 'సరే!' అన్నట్లుగా తల ఆడించాడు.

మల్లయ్య చెరుకు గానుగ ఆడాడు. బెల్లం అరగొండ బెల్లానికి అబ్బగా సవరం మాదిర్తో దిగింది. ఈదెబ్బతో అప్పుతీర్చేసి అంతోఇంతో ఇరుపుకూడా పెట్టుకోవచ్చులే! అని మునాస పడ్డాడు.

అయితే ఆశ నిరాశే అయింది.

బెల్లంధర బాగా పడిపోయింది!

మళ్ళీ బెల్లంధర పలికేదాక ఇరుపుబెట్టి ఎదురుచూడాలంటే వీలుగాని పని. గంగుల్ నాయుడు నెత్తిమీద కూర్చుంటాడు. అమ్మేస్తే ఒకటికి సగంగా చేతికొస్తుంది. ఏం చెయ్యడానికి తోచకుండా మల్లగుల్లాలు పడ్తున్న సమయంలో పురుడు పోసుకోవడానికి పుట్టిల్లు చేరిన పెద్దమ్మాయి ప్రసవించింది.

మల్లయ్య బేరంపెట్టక తప్పలేదు.

బెల్లానికి అనుకున్న ధర రాకపోవడం...వచ్చిన మొత్తంలో కూడా బారసాలకు అంతో ఇంతో ఖర్చుకావడం– గంగుల్ నాయుడు బాకీ తీరేతీరు కనిపించలేదు.

ఏం చెయ్యాలి? నాయుడు ఎదురుపడి అడిగితే ఏమని బదులు చెప్పాలి? అని గునుస్తూ ఉంటే ఆ ముందటి రోజు సంజవేళ గ్రామచావిడి దగ్గర సంఘటన ఎదురుచూసిందే కానీ ఎదురుచూడని విధంగా అభిమానం మీదనే దెబ్బతీసింది.

"ఇదో మల్లయ్యా! ఈ పితలాటకాలన్నీ నా దగ్గిర పనికిరాదు. మణిసన్నోడు మాటకు కట్టుబడి కాపాడుకోవాల!... ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోవాల!" నిలదీశాడు నాయుడు.

"నన్నేం జెయ్యమంటావ్ సెప్పు గంగులన్నా?... బెల్లంరేటు పడిపోకుండా ఉంటే... నన్నుగురించి నీకు తెలవన్ది ఏంవుండాది!... పువ్వుల్లో బెట్టి అసలూ వడ్డీ..."

మల్లన్న మాట మల్లన్న నోట్లో ఉండగానే-

"బెల్లంరేటు పడిపోతే నాకేం? పైకిపోతే నాకేం?... బెల్లం రేటే ఎక్కిపొయ్యుంటే ఎగేసేఁవైనా ఇయ్యబోతావా? అప్పుజెయ్యకముందే ఉండాలయ్యా ఆతెలివి!- చేసింతర్వాత అడవసాపలేస్తుటారో? ఆండ్లనే పండబెట్టారో?... నాకెందుకూ?"

గుండెలో గునపంలా గుచ్చుకొనిందా మాట.

మల్లయ్య వంచిన తలెత్తలేదు.

"సెనిగ పంట సేతికందలేదంటే సరేనంటి. సెరుగ్గానిగాడిస్తానంటే పల్లెత్తుమాట పలికితినా? లేదు. ఎందుకు? నీ మంచితనాన్ని చూసి. ఇంకొకరింకొకరైతే ఏం జరిగేదో నీకేతెల్సు. రేపు రాత్తిరికి మద్దిస్తం. ఏంజేస్తావో నీ ఇష్టం."

దురుసుగా మాట్లాడి విసురుగా వెళ్ళిపోయాడు గంగుల్ నాయుడు.

"అప్పుజేస్తే మాత్రం... ఆమాట కొస్తే చెయ్యని నాకొడుకెవుడు?... చేస్తే మాత్రం... అనుకున్న టయానికి చెల్లించకపోతే మాత్రం... ఆలిని పండబెట్టాల్నా?... ఆ మణిసికి నోరెట్లా వచ్చిందబ్బా? అంత మాటనిపించుకోని బతికితే ఏం? బతక్కపోతే మాత్రం ఏం?" అని ఆ ముందటిరోజు సాయంకాలంనుండి మల్లయ్య తనలో తాను సతమతమై పోతున్నాడు.

మల్లమ్మ మొగంచూస్తే చాలు అతనికడుపు మండిపోతూ ఉంది.

"అయ్యో! అది మహాఇల్లాలే! ఒకరి జోలికి పోతిందా? ఒకరి మాటకు పోతిందా? అంత మంచి మణిసిని పట్టుకోని అంతమాటంటాడా నాయుడు! నాయాలు- వాడిరగతం కండ్ల చూద్దును. కానీ, వాడికి బాకీ పణ్ణాను. అందుకే తలొంచుకోవాల్సొచ్చింది. పోనీ దాని ఉసురు గొట్టకుండా పోతిందా?" అని తనలోతాను తర్కించుకొంటూ సమాధాన పడుతున్నాడు మల్లయ్య.

పొద్దు తిరిగింది. దుర్గంరాజుల కయ్య తడిపడింది. మల్లయ్య మోట విడిచి పెట్టాడు. ఇంటికివచ్చి అంతసంకటో సలిబిండో ఎంగిలిపడ్డాడు. తానంత తింటూనే పశువుల కొట్టంలో మంచంవాల్చి కూర్చుని ఎద్దుల్ని ఎదురుగా నిలబెట్టుకొని మేపు నోటికందించే వాడు. కానీ ఆరోజు గాటగట్టిన గొడ్లమొగాన అంత ఎండుగడ్డి విదిల్చి ఎకాఎకిని బయలుదేరాడు.

మల్లయ్య గడపలో కాలు పెట్టేసరికి రాజన్న సుష్టుగా భోంచేసి వసారాలో మంచం వాల్చి కూర్చుని తాంబూలం సేవిస్తున్నాడు.

రాజన్న పల్లెలోనే కాదు- పట్నంలోకూడా మంచిపలుకుబడి ఉన్నమనిషి.

వేళకానివేళ రాకరాక వచ్చిన మంచిమనిషి మల్లయ్యకు రాజన్న రాచమర్యాదలు జరపకపోయినా మల్లయ్య చెప్పినదంతా విన్నాడు. తాను చెప్పవలసింది చెప్పాడు. రాత్రి మద్దిస్తానికి తప్పక వస్తానని మద్దిస్తంలో తాను చెప్పినట్లు చేయమని సలహా ఇచ్చాడు.

మల్లయ్య మనస్సు కాస్త స్తిమిత పడింది.

* * * *

అలనాడు హరిశ్చంద్రుడు ఆడిన మాట నిలబెట్టుకోవడానికి ఆలిని అమ్ముకొన్నాడట! తాను కాటికాపరి అయ్యాడట! పాపం! ఆ సత్యనంధుని కథలో సత్యమెంతో అసత్యమెంతో మనకు తెలియదు. కానీ ఊళ్ళోమాత్రం గంగుల్‌నాయుడి దగ్గర అప్పు తీస్తేమాత్రం సత్యం నాలుగు పాదాల మీదేంఖర్మ! అయిదు పాదాల మీద అందాలు పోతుంది.

దీనికికారణం సాధారణంగా అప్పుఇచ్చేమనిషి తానుగా పెట్టేగడువువంటి గడువు కాదది. తీసుకొన్నవాడే తనకు తానుగా తవ్వుకొన్న గుంతలాంటి గడువు. తీసుకొన్నవాడు మహా జాగ్రత్తగాఆలోచించి తనపరిస్థితులు ఎప్పుడుఅనుకూలిస్తాయో బేరీజువేసుకొని మాట చెప్పాలి. మాటప్రకారం నడుచుకోవాలి. నడుచుకోకపోతే గ్రామచావిడి కాడ మద్దిస్తం. ఆ మద్దిస్తంలో పదిమంది పెద్దమనుషులు ఎలా చెప్పితే అలా!

ఆరోజు సాయంత్రం మాటతప్పిన మల్లయ్య సంగతి తేల్చడానికి మద్దిస్తం.

మల్లయ్య తీసుకొన్న బాకీ... దాని మీద అయిన వడ్డీ... ఈ మొత్తాన్ని చెల్లించడానికి మొదట పెట్టిన గడువు... ఆ గడువు దాటిపోతే మళ్ళీ పెట్టిన గడువు... ఆ గడువు కూడా దాటిపోతున్నా మల్లయ్య బాకీ చెల్లించకపోవడాన్ని మళ్ళీ మళ్ళీ వివరించి ఆ పై నిర్ణయాన్ని పెద్ద మనుషులకే వదిలి గంగుల్ నాయుడు కాలుమీద కాలేసి దర్జాగా కూర్చున్నాడు.

"మల్లయ్య మంచోడే! కాదన్లేం. శెనిక్కాయ పంట చేతికందకపాయ. అదేంవీ అపద్దం కాదు. బెల్లంధరసూస్తే ఇద్దోయిట్టా కొళ్ళబడిపోతా ఉండాది. అయితేమటుకు చేసిన బాకీ బాకీయేగదా? ఏదైనా అమ్మిఆర్పి తీర్సాల్సిందేగదా?"

"అదినిజంవే అనుకో మాంవా! గంగుల్‌నాయుడికి గడవనప్పుడు మాటగదాఅది. ఆయనకు కావాల్సింది వడ్డేగదా? ఇప్పుడు మల్లా వడ్డీమొదులెత్తి రాసిస్తే సరిపోలా?"

"ఒరే... నువ్వు సెప్పేది బలే బాగుండాది గదరా! అప్పు తీసుకున్నోళ్ళందురూ అదేపనిగా ఎత్తెత్తి రాసిస్తా కూసుంటే అసలోడి గెతేం కావాల?"

"వాడు సెప్పేదది గాదులే! ఈఊళ్ళో వాళ్ళందరూ మణుసులే గాదు. మల్లయ్య ఒక్కడే మణిసి. ఆయన కొచ్చిన బాదే బాద. ఇంకెవుడికన్నా బాదలుండాయా? పాడా? తీసుకుణ్ణింది ఆయన దగ్గిర్నే పెట్టుకుంటే అందురి బాదలు తీరిపోతాయి."

"ఈ కతలన్నీ తీసి పక్కనపెట్టండ్రా. ఊరినాయం పాయ్‌గెవిన్లో తెల్లారిందా? – దుడ్లతో లావాదేవీలన్నీ ఒక్కమాట మిందనే గదా నడస్తా ఉండాయి. ఆమాటేపోతే మానం అబిమానం రొండూ పాయ్‌నట్టేగదా?"

తలకొక్క తీరుగా తర్జన భర్జనలు పడుతూఉంటే రాజన్న అక్కడికి వచ్చాడు.

రాజన్న రావడంతోటే అందరు గౌరవంగా పైకి లేచారు. గంగుల్‌నాయుడు కూడా పైకి లేచి రాజన్నకు తనపక్కన్నే చోటు చూపించాడు.

రాజన్న గంగుల్‌నాయుడి పక్కన్నే కూర్చుని నవ్వుతూ ఆప్యాయంగా అతని భుజంమీద చేయి వేశాడు.

రాజన్న ఆమాత్రం అభిమానం ప్రకటించడం అపురూపం.

గంగుల్‌నాయుడికి ఉన్న ఆర్థికవసతి రాజన్నకు లేకపోవచ్చు. పెద్దపెద్ద మిద్దెలు, మేడలు, లేకపోవచ్చు. పొలమూ పుట్రా కూడా లేకపోవచ్చు. కానీ రాజన్న ప్రజల మనిషి! పరపతి కలిగిన మనిషి. అతడు నోరు విప్పడమే కష్టం. విప్పితే ఆమాటకు అడ్డుచెప్పడం కూడా చాలాకష్టం. అలాంటి రాజన్న పక్కన కూర్చొని భుజం మీద చెయ్యి వేసేసరికి నాయుడు మెలికలు తిరిగిపోతున్నాడు.

"ఆఁ!... అయితే ఎంతవరకు వచ్చింది వ్యవహారం?"

"రావడానికేంఁవుండాది, రాజన్నా! ఇప్పుడే వచ్చి కూసుంటా ఉండాం. పుర్రె పుర్రె కొకబుద్ధి గదా? ఎవుడికి తోసినట్టు వాడు మాట్లాడ్తా ఉండాడు. అంతలో తఁవరు రానే వచ్చినారు."

"ఏం మల్లయ్యా! నువ్వు గంగుల్‌నాయుడు దగ్గర అప్పుచేసిన మాట నిజఁవేగదా?" రాజన్న అందుకొన్నాడు.

"నిజఁవేనన్నా!"

"అయితే ఇందులో ఇంక పంచాయితీ ఏం ఉండాది? కయ్యో కాలవో తెగనమ్మి అప్పు కట్టేయాల్సిందే గదా?"

గంగుల్ నాయుడు ముఖం విప్పారింది.

"పోనీ, నువ్వు చెప్పుకోవాల్సిందేమైనా ఉండాదామల్లయ్యా!"

ఆమాట కోసమే ఎదురుచూస్తున్నట్లుగా మల్లయ్య అమాంతంగా వంగి గంగుల్ నాయుడు కాళ్ళురెండూ ఒడిసి పట్టుకొన్నాడు. "నాయుడుగారూ! సచ్చి ఇంకొక జల్మంలో నీ కడుపున పుట్తా. నా పరిచ్చితులన్నీ మీకు తెలుసుగదా? అసలిచ్చేస్తా. వడ్డీతోసెయ్. ఈ గెండాన్నట్లా గెట్టెక్కించన్నా!" అని పట్టిన కాళ్ళు వదలకుండా ప్రాధేయపడ్తున్నాడు మల్లయ్య.

మద్దిస్తానికి వచ్చిన పెద్దమనుషులు ఎవ్వరూ ఊహించని సంఘటన ఇది. అందరూ రెప్పార్చకుండా మల్లయ్యను చూస్తున్నారు. ఎవరి నోటా మాటపెగల్లేదు. 'అయ్యో ఎంత మంచోడికేంగతి పట్టిందబ్బా!' అని నిట్టూరుస్తున్నారు.

"చూడండి, నాయుడుగారూ! పాపం కాళ్ళు పట్టుకొని బతిమాలుతున్నాడు."

రాజన్న కలగజేసుకొన్నాడు.

"మీరుకూడా అట్లాజెప్తే ఎట్లా రాజన్నా? ఇదేఁవన్నా మాతాత ముత్తాతలు సంపాదించి పెట్టిన ముల్లా? నేనూ ఇంకొకరికి అచ్చిరాలా అచ్చాల్సిందేగదా?"

"కాదని నేను చెప్పడం లేదు నాయుడుగారూ! కాళ్ళు పట్టుకొని బతిమాలుతున్నాడుగదా? కాస్త కనికరించండి."

"ఆయన్ను నేను కనికరిస్తే నన్ను కనికరించే వాళ్ళెవరు?"

"అట్లన్నావ్? బాగుంది. మల్లయ్య బాకీవరకు వడ్డీ మాఫీచెయ్యమని మీషాహుకారుతో నేను చెప్తాను. సరేనా?"

"అట్లయితే ఇంకేంవుండాది? మీ ఇష్టం!"

ఆ మాట చెవిని పడడమే తరువాయి మల్లయ్య నాయుడు కాళ్ళు విడిచిపెట్టి పంచకొంగులో మూటగట్టుకొచ్చిన డబ్బును గంగుల్‌నాయుడిచేత పెట్టాడు. నాయుడికి తీసుకొనక తప్పలేదు.

"మాకు తెల్సయ్యా తెల్సు. మణిసిలో మంచితనమే ఉంటే ఏదో ఒక రకంగా వాడికి మంచి జరుగుతుందని!" అని మల్లయ్య అనే మంచిమనిషికి జరిగిన మంచినిగురించి తలపోస్తూ పెద్దమనుషులు పైకిలేచారు!

రామాలయంలో పూజ జరుగుతున్నట్లుంది. గంట గణగణ మోగుతూ ఉంది!

* * * * *

రాజన్న కుదిర్చిన రాజీ...మల్లయ్యకు జరిగిన మంచి... నాయుడి మంచితనం... ఆ ఊళ్ళో చిలవలు పలవలుగా చిత్రించి నలుగురు గుమిగూడే బడికాడ గుడికాడ పనిపాటలకు వెళ్ళినపుడు మడికాడ మాట్లాడుకొంటూనే ఉన్నారు.

వారం తిరిగినట్లు తెలియకనే తిరిగిపోయింది.

పూజా మందిరంలో గంగుల్ నాయుడు ఇనప్పెట్టె ముందు కూర్చున్నాడు. పట్టణంలో షాహుకారుకు తాను ఆ నెల చెల్లించవలసిన వడ్డీ, అసలు లెక్క గట్టాడు. మల్లయ్య చెల్లించిన అసలుఉంది. కానీ దానిపై వడ్డీ లేదు. ఒక్క క్షణం మనస్సు గతుక్కుమనింది. అంతలోనే రాజన్న మనసులో మెదిలాడు. పట్టణంలో ఆయనకున్న పరపతిని తలుచుకొన్నాడు. తృప్తిగా నిట్టూర్చాడు.

ఆవేళ తాను పట్టణానికి పట్టుకుపోవలసిన పైకాన్ని పక్కనబెట్టి ఇనప్పెట్టె తాళాలు వేసి తాళం సరిగ్గాపడిందో లేదో లాగిలాగి చూసి పడిందన్న తృప్తి చిరునవ్వుగా మారితే ఆతర్వాత అగదిలో నిత్య పూజా పునస్కారాలతో వెలుగొందుతున్న వడ్డికాసులవాడివైపు తిరిగి ఆయన వాటాను హుండీలో వేసి పట్టణంలో తనపని దిగ్విజయంగా జరిపించమని మొక్కి ఎంచి ఏడుగుంజిళ్ళు తీసి చెంపల్ని ఫెళా ఫెళా వాయించుకొని వడ్డికాసుల్ని చేతపట్టుకొని బయల్దేరాడు నాయుడుగారు!

వెదకపోయిన తీగ కాలికే తగిలినట్లు గంగుల్‌నాయుడు రాజన్న ఇంటి గడపలో అడుగు పెట్టూ ఉంటే రాజన్న రాజాలా తయారై ఎదురొస్తున్నాడు. గంగులయ్య రావడం గమనించి "రండి! నాయుడూ, రండి!" అని ఆహ్వానించాడు.

గంగుల్ నాయుడు అడుగు ముందుకు వేయలేదు కానీ, అతి మర్యాదగా దారి తొలిగి నిలబడ్డాడు. అంతలోనే రాజన్న నాయుడిగార్ని సమీపించాడు.

"ఏం నాయుడుగారూ! ఏంవిటి విశేషాలు?"

"ఏంవీలేదు, రాజన్నా!..అదే- అదే!"... అంటూ నాయుడు నీళ్ళు నములుతున్నాడు.

"ఏదీ?" అని మతికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నటించాడు రాజన్న.

"అదే రాజన్నా! అదే- మల్లయ్య వడ్డీబాపతు!"

ఆ మాట చెవిన పడడంతో గచ్చుకాయల కుండలో చెయ్యిబెట్టి కలబెట్టినట్లు గలగల నవ్వాడు రాజన్న! ఆతర్వాత-

"దానికేంవుంది నాయుడూ! పోవడం రావడం ఎంతసేపని? ఒక్క గంట ప్రయాణమే గదా? పద!" అన్నాడు ఎంతో తెంపుగా రాజన్న.

రాజన్న ముందు గంగుల్‌నాయుడు వెనకగా బయలుదేరారు. వాళ్ళిద్దరూ ఊరి ముందర రోడ్డు మీదికి రావడం... వాళ్ళకోసరమే బస్సురావడమన్నట్లుగా బస్సు వచ్చింది. ఇద్దరూ బస్సెక్కి కూర్చున్నారు.

బయలుదేరుతూనే బస్సు దొరకడం శుభసూచకంగా తలపోసిన గంగుల్ నాయుడి తలపులు మలుపులు తిరుగుతున్నాయి.

"మల్లయ్య తనదగ్గిర బాకీచేసినాడన్న సంగతి మాత్రమే రాజన్నకు తెల్సు కానీ, ఎంత? ఏంవి అన్న వివరాలు తెల్దుగదా? అటుమంటప్పుడు మల్లయ్య బాకీ రెండంతలో మూడంతలో చేసేస్తే మిగిలినంతవరకు వడ్డీ మిగులుతుంది. ఎట్లా రాజన్న పరపతిని వాడుకుంటా ఉండాం. వాడుకుండేటప్పుడు సరిగ్గానే వాడుకుంటే సరిపోతింది?" అని గంగుల్ నాయుడు ఆలోచిస్తున్నాడు.

రాజన్న రాజకీయాల్లోపడి రాష్ట్రముఖ్యమంత్రిని బర్తరఫ్‌చేయడంలో రాష్ట్ర గవర్నర్ అధికారాల్ని ఆ అధికారాల్ని వినియోగించడంలో ఆయన విఫలుడైన విషయాన్ని తెంపుగా తెగ విమర్శించేస్తున్నాడు.

ఆలకించేవాళ్ళు ఆలకిస్తున్నారు. కూర్చోవడానికి చోటు దొరక్క నిలబడి ఉన్నవాళ్ళు అవస్థపడుతున్నారు. వాటితో నిమిత్తంలేని బస్సు గమ్యంచేరింది.

రాజన్న, గంగుల్ నాయుడు బస్సుదిగారు. దిగీదిగడంతోటే నాయుడు రిక్షాకోసరం నానా యాతన పడ్తాంటే రాజన్న-

"మీకు తెల్సునోతెల్దో కానీ నాయుడూ! నేను రిక్షా ఎక్కనండి. నామట్టుకు నాకది ఎబ్బెట్టుగా ఉంటుంది. మనిషిమీద మనిషిఎక్కడంవేంది? అందులో మనమిద్దరం ఆ ఒక్కడి మీద పడ్తే-వాడి చావు చూళ్ళేం!"

గంగుల్ నాయుడి గుండె రెక్కలు తొడుక్కొని ఆనందంగా ఎగురుతూ ఉంది.

ఇద్దరూ ఒకరు ముందు ఒకరు వెనుకగా నడుస్తున్నారు.

"రాజన్నా! ఈకాలం రాజకీయాల్లో మీలాంటోళ్ళన్నా ఉండాల్సింది. మీరు బస్సులో మాట్లాడతా ఉంటే జనం అట్లానే గుమ్మయ్ పొయ్‌రే! ఈ కాలం వాళ్ళూ ఉన్నారు. ఎందుకూ? వాళ్ళ పనులు చూసుకోవడానికే సరిపోతా ఉండాది. మీరట్లాగాదే? ఇప్పుడు సూడండి. ఈ పన్లో లాబపడ్తా ఉండేదెవురు? మల్లయ్య. వాడేఁవన్నా అనుకుంటా ఉంటాడా? లేదే? వాడి పని వాడిది. అయినా వాడి పనికోసరం మీరు మీపన్లన్నీ వదిలిపెట్టేసి వచ్చినారు. ఇంకా మీలాంటోళ్ళు ఉండబట్టేగదన్నా పొద్దుమొలస్తా ఉండాది." పొటందుకొన్నాడు నాయుడు.

రాజన్న చిరునవ్వుతో ముందు నడుస్తున్నాడు.

షాహుకారు గుమ్మంలో ఇద్దరు అడుగు పెట్టున్నారు. రాజన్న ఉన్నట్లుండి నిలబడి 'నాయుడుగారూ! ఒక్క మాట' అన్నాడు.

గడపలోపల ఒక కాలు బయట ఒకకాలుగా నిలబడిన నాయుడు రాజన్నవైపు ఆత్రంగా చూస్తున్నాడు.

"చూడండి, నాయుడూగారూ! షాహుకారుతో చెప్పడానికి నాకేఇబ్బంది లేదు. వచ్చింది అందుకేగదా? నా పలుకుబడి అంతా ఉపయోగించి నీకు చెయ్యాల్సినంత మేలు తప్పక చేస్తా. భయపడాల్సిన పనేలేదు. అయితే ఒక్క పని చేయాలి!"

"ఏంది రాజన్నా ఆపని?"

"అదే, మల్లయ్య చేసిన పని!"

"అంటే నేను షాహుకారు కాళ్ళు పట్టుకోవాల్నా?

"అంతేగదా మరి?"

గుండె దిగజారిపోతున్నట్లు.. ఎవరో తనపరపతినంతా నిర్దాక్షిణ్యంగా గుంతతీసి అందులో పాతుతున్నట్లు... ఆ ఊరుఊరంతా ఒకటై తనముందు నిలబడి విరగబడి నవ్వుతున్నట్లు ఒక విచిత్రమైన భావన నాయుడి మనస్సును ఆవరించింది.

మల్లమ్మ! అలనాటి మల్లమ్మ కాకపోయినా మహా ఇల్లాలే! ఆమె ఉసురే కొట్టిందో?... రాజన్న లౌక్యానికి చేతులు మొలిచి ఈచెంపా ఆచెంపా అదరకొడుతుంటే- అయ్యోపాపం! గంగుల్ నాయుడు మనస్సు పగ్గాలు తెంపుకొని పల్లెలో రచ్చబండకు ప్రదక్షిణ చేస్తూ ఉంది! ●

ఆంధ్రప్రభ
(24, అక్టోబర్ 1984)